ప్రజాశక్తి
సోమవారం 9 జూన్ 2025

నేడు ఇన్నోవేటివ్ హబ్‌కు శంకుస్థాపన

పార్వతీపురం : పట్టణంలో నిర్మించనున్న ఇన్నోవేటివ్ హబ్బుకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సోమవారం శంకుస్థాపన చేయనున్నారని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శిలాఫలకాన్ని షైనింగ్ స్టార్స్ కార్యక్రమం వద్ద ఆవిష్కరిస్తారన్నారు. ఆశవాహ జిల్లాల్లో భాగంగా మన్యం జిల్లాకు నీతి అయోగ్ ప్రోత్సాహకంగా అందించిన రూ.3కోట్లతో ఈ హబ్‌ను నిర్మించేందుకు జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. ఇన్నోవేటివ్ హబ్ విద్యార్థుల్లో అనుభవ పూర్వక అభ్యసనకు ఉద్దేశించడం జరిగింది. ఈ హబ్‌లో ప్లానిటోరియంతో సహా భౌగోళిక, రసాయన, భౌతిక, జీవ శాస్త్రాల విషయ పరిజ్ఞానాలకు సంబంధించిన పరికరాలను పొందుపర్చుతారు. విద్యార్థులు ప్రత్యక్ష అనుభవ పద్ధతిలో నేర్చుకునే అవకాశం కలుగుతుంది. జిల్లాలోని వివిధ ప్రాంతాల విద్యార్థులను హబ్బుకు తీసుకురావడం తద్వారా విషయ పరిజ్ఞానం అందించి జిల్లా నుండి మంచి విద్యార్థులను తయారు చేయుటకు ఉద్దేశించడం జరిగింది.

అయిన వారికి ఆకులు...కానివారికి కంచాలు

ప్రజాశక్తి - పార్వతీపురం

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ జిల్లా పర్యటనకు వస్తున్న నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర తీరుపై ఫిర్యాదుకు రంగం సిద్ధమవుతోంది. ఈ మేరకు తెలుగు తమ్ముళ్లు అస్త్రశస్త్రాలతో సమాయత్తమవుతున్నట్టు తెలిసింది. మండలంలోని చినబొండపల్లిలో సోమవారం నిర్వహించనున్న రహస్య భేటీలో యువనేత లోకేష్ దృష్టికి ఏడాది కాలంలో ఎదుర్కొన్న ఇబ్బందులు, సమస్యలను తీసుకెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. పదోతరగతి, ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డులు ప్రదానం చేయడానికి మంత్రి లోకేష్ జిల్లా పర్యటనకు వస్తున్నారు. అధికారికంగా ఈ కార్యక్రమంలో లోకేష్ పాల్గొంటారని జిల్లా అధికారులు పైకి చెపుతున్నారు. కానీ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో నిర్వహించనున్న రహస్య భేటీ కోసమే జిల్లా పర్యటనకు వస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడాది కాలంలో నియోజకవర్గంలో పార్టీ ప్రతిష్ట దిగజారిందనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. ఎమ్మెల్యే వ్యవహారశైలి నచ్చకపోవడంతో నియోజకవర్గంలో కొంతమంది సీనియర్ నాయకులు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. అయినవారికి ఆకులు, కానివారికి కంచాలు అన్న చందంగా ఎమ్మెల్యే బోనెల వ్యవహారశైలి ఉండడంతో సీనియర్ నాయకులు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. భూకబ్జాలు, దందాల్లో ఎమ్మెల్యే బోనెల మితిమీరిన జోక్యం చేసుకోవడంతో పార్టీ ప్రతిష్ట మసకబారిందని ఫిర్యాదు చేయనున్నట్టు తెలిసింది. అలాగే ప్రతి చిన్న పనికీవసూళ్లు చేయడంపై కార్యకర్తలు, నాయకులలో అసంతప్తి గూడు కట్టుకుంది. టిడ్కో ఇళ్ల పట్టాల వ్యవహారంలో నకిలీ పట్టాల పంపిణీకి కుంభకోణంలో పెద్ద ఎత్తున వసూళ్ల దందా సాగింది. ఈ అవినీతి బాగోతంలో ఇప్పటికే పార్టీకి చెందిన ఒక మహిళా కార్యకర్తను పోలీసులు అరెస్టు చేశారు. వరహాల గెడ్డ ఆక్రమణల పేరిట కొంతమంది పేదలకు మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేయడం, వారి నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేయడం వెనుక కీలక పార్టీ నేత హస్తం వుంది. ఉద్యోగ నియామకంలో ఎక్కువ డబ్బు ఇచ్చిన వారికి ప్రాధాన్యత ఇవ్వడం, వైసిపి కార్యకర్తలకు సిఫార్సు చేయడంతో ఎమ్మెల్యే, సీనియర్ నాయకుల మధ్య అగాధం ఏర్పడినట్టు తెలిసింది. సీనియర్ నాయకుల మాటకు విలువ లేకుండా చేసి తన చుట్టూ కోటరీ ఏర్పాటు చేసుకుని ఇష్టారాజ్యంగా వ్యవహరించడం వివాదాస్పదమవుతోంది. గత ఎన్నికల్లో ఎమ్మెల్యే గెలుపునకు కష్టపడిన సీనియర్ నాయకులను కరివేపాకుల్లా విసిరేశారనే బాధ తెలుగు తమ్ముళ్లలో కనిపిస్తోంది. ఒక ఉద్యోగానికి నలుగురైదుగురు నుంచి లక్షల్లో వసూలు చేయడం, ఒకరికి ఉద్యోగానికి సిఫార్సు చేయడం తో మిగిలిన వ్యక్తులు ఇచ్చిన డబ్బుల కోసం కాళ్లరిగేలా తిరగడం చర్చనీయాంశమవుతోంది. ఇలాంటి సంఘటనలు బలిజిపేట మండలంలో జరగడంతో స్థానిక నాయకులు అసంతృప్తితో రగిలిపోతున్న పరిస్థితి ఏర్పడింది. కొద్దినెలల క్రితం జరిగిన రేషన్ డీలర్ల నియామకాల్లో డబ్బులు ఇచ్చిన వారికే సిఫార్సు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. తాళ్ళబురిడిలో రేషన్ డీలర్ పోస్టును వైసిపి కార్యకర్తకు సిఫార్సు చేయడంతో ఆ గ్రామానికి చెందిన టిడిపి నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే నివాసం వద్ద ధర్నా చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. సీతానగరం మండలంలోని పెదంకలాం ప్రాజెక్టు నీటి సంఘం ఎన్నికల్లో టిడిపి ఆవిర్భావం నుంచి ఉన్న నాయకుడిని కాదని వైసిపి నుంచి పార్టీలో చేరిన నాయకుడికి సంఘం అధ్యక్షుడిగా నియమించడం తెలుగు తమ్ముళ్లలో అసంతృప్తి బీజం నాటింది. ఈ వ్యవహారంలో పరాయి పార్టీ నాయకుడి నుంచి ముడుపులు తీసుకున్నారనే ఆరోపణలు గుప్పుమన్నాయి. పార్టీకి ఆయువుపట్టు లాంటి సీతానగరం, పార్వతీపురం, బల్జిపేట మండలాలతో పాటు మున్సిపాలిటీకి చెందిన సీనియర్ నాయకులు ఎమ్మెల్యే వైఖరి నచ్చకపోవడంతో దూరంగా వుంటున్నారు. తాజా పరిస్థితుల్లో నియోజకవర్గంలో పార్టీ ప్రతిష్ట డేంజర్ జోన్ లోకి వెళ్లిందనే నివేదికలు అధిష్టానం వద్దకు చేరడంతో దిద్దుబాటు చర్యలకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. దీనిలో భాగంగా యువనేత లోకేష్ సోమవారం చినబొండపల్లిలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో రహస్య భేటీ నిర్వహించనున్నారు. ఈ భేటీలో తెలుగు తమ్ముళ్లు ఎమ్మెల్యే తీరుపై ఫిర్యాదుకు రంగం సిద్ధం చేసుకున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి.

ద్వారపురెడ్డి భవితవ్యం తేలనుందా?

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్‌తో నిర్వహించనున్న రహస్య భేటీకి పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి జగదీష్‌ను ఆహ్వానించినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, మాజీ ఎమ్మెల్సీ జగదీష్ మధ్య ఉప్పు, నిప్పు లాంటి విభేదాలు ఉన్నాయి. నియోజకవర్గంతో పాటు జిల్లాలోనే బలమైన సామాజిక వర్గానికి చెందిన జగదీష్‌ను వదులుకునే పరిస్థితిలో పార్టీ నాయకత్వం లేదని తెలుస్తోంది. ఈ రహస్య భేటీలో జగదీష్ భవితవ్యంపై స్పష్టత వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

ఎమ్మెల్యే తీరుపై ఫిర్యాదుకు రంగం సిద్ధం
నేడు తెలుగు తమ్ముళ్లతో లోకేష్ రహస్య భేటీ

మంత్రి సభా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్‌పి మాధవరెడ్డి

నేడు మంత్రి లోకేష్ రాక

పార్వతీపురంరూరల్ : పట్టణంలో సోమవారం జరగనున్న జిల్లా స్థాయి షైనింగ్ స్టార్స్ కార్యక్రమానికి రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ హాజరు కానున్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు సత్కార కార్యక్రమంలో పాల్గొని, విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడే కార్యక్రమాన్ని స్థానిక రాయల్ కన్వెన్షన్‌లో ఏర్పాటు చేశారు. ప్రతి మండలం నుంచి ఆరుగురు విద్యార్థులను ఎంపిక చేశారు. ఇందులో పదో తరగతి విద్యార్థులు 95 మంది కాగా, ఇంటర్ విద్యార్థులు 26 మంది ఉన్నారు. ప్రతి విద్యార్థికి రూ.20 వేలు నగదు, ఒక సర్టిఫికెట్, ఒక మెడల్‌ను మంత్రి అందిస్తారు. మంత్రితో ముఖాముఖి కార్యక్రమానికి విద్యార్థితో పాటు తల్లిదండ్రుల్లో ఒకర్ని ఆహ్వానించారు. కార్యక్రమం సోమవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుంది. కార్యక్రమం అనంతరం పార్వతీపురం మండలం చినబొండపల్లిలో ఏర్పాటు చేసిన ప్రైవేట్ కార్యక్రమంలో మంత్రి పాల్గొననున్నారు. ఇందుకు సంబంధించి కార్యకర్తల సమావేశానికి చేపట్టిన ఏర్పాట్లను ఆదివారం ఎస్‌పి ఎన్‌వి మాధవరెడ్డి పరిశీలించారు. అలాగే హేలీప్యాడ్ పనులను సబ్‌కలెక్టర్ అశుతోష్‌శ్రీవాస్తవ పరిశీలించారు.

కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన ఉపాధ్యాయులు

కదంతొక్కిన ఉపాధ్యాయులు

- కలెక్టరేట్ ముట్టడి, రాస్తారోకో
- ఎస్‌జిటిలకు మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహించాలి
- ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక డిమాండ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎస్‌జిటిలకు ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహించాల్సిందేనని ఉపాధ్యాయులు కదంతొక్కారు. ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ను ఆదివారం ముట్టడించారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా ఉదయం 9.30 గంటలకు కలెక్టరేట్‌కు ఉపాధ్యాయులు చేరుకున్నారు. డిఇఒ కార్యాలయాన్ని ముట్టడించేందుకు వెళుతుండగా పోలీసులు అడ్డుకుని, కలెక్టరేట్ గేట్లు మూసివేశారు. దీంతో కలెక్టరేట్ ప్రధాన గేటు వద్ద ఉపాధ్యాయులు బైఠాయించారు. ఆన్‌లైన్ కౌన్సిలింగ్ వద్దు, మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహించాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ప్రభుత్వం దిగొచ్చే వరకూ కౌన్సిలింగ్‌లో పాల్గొనేది లేదని తెగేసి చెప్పారు. ఉపాధ్యాయులతో ఆడుకోవాలని చూస్తే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కలెక్టరేట్ రెండు గేట్లు మూసివేయించి ముట్టడి కొనసాగించారు. ఒంటిగంట సమయంలో కలెక్టరేట్ కూడలిలో రాస్తారోకో నిర్వహించి, ముట్టడి కార్యక్రమం ముగించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, నాయకులు రమేష్‌చంద్ర పట్నాయక్, డి.రాము, కె.విజయగౌరి, పిఆర్‌టియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవీంద్ర నాయుడు, డి.శ్రీనివాసరావు, ఉత్తరాంధ్ర మీడియా ఇన్‌ఛార్జి బంకపల్లి శివప్రసాద్, ఎస్‌టియు నాయకులు డి.శ్యామ్, జోగారావు, సూరిబాబు, ఎపిటిఎఫ్-1938 రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.ఈశ్వరరావు, పైడిరాజు, ఆపస్ జిల్లా అధ్యక్షులు కె శ్రీనివాసరావు, డిపిఆర్‌టియు నాయకులు పి.శ్రీనివాసరావు, ఎస్.నాగేశ్వరరావు, ఎపిటిఎఫ్ -257 నాయకులు పి.శ్రీనివాస, ఆప్టా రాష్ట్ర అధ్యక్షులు గణపతిరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున ; బాధ్యతలు స్వీకరిస్తున్న డిసిఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ

కొలువుదీరిన చైర్మన్లు

ప్రజాశక్తి - కంటోన్మెంట్

డిసిసిబి, డిసిఎంఎస్ చైర్మన్లుగా కిమిడి నాగార్జున, గొంప కృష్ణ కొలువుదీరారు. ఈ మేరకు ఆదివారం వారు బాధ్యతలు స్వీకరించారు. వారికి ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, గుమ్మడి సంధ్యారాణి, కేంద్ర మాజీ మంత్రి పి.అశోక్ గజపతిరాజు, ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు కిమిడి కళావెంకటరావు, కోండ్రు మురళీమోహన్, కోళ్ల లలితకుమారి, లోకం నాగమాధవి, అదితి గజపతిరాజు, బోనెల విజయ్‌చంద్ర, మాజీ మంత్రి కిమిడి మృణాళిని, మాజీ ఎమ్మెల్యేలు ఆర్‌పి భంజ్‌దేవ్, కిమిడి గణపతిరావు, కె.ఎ.నాయుడు, తదితరులు అభినందనలు తెలియజేశారు.

రైతాంగానికి తోడ్పాటునందిస్తా : నాగార్జున

డిసిసిబి ద్వారా వ్యవసాయ రంగానికి, రైతులకు తోడ్పాటు అందించేందుకు కృషి చేస్తానని చైర్మన్ కిమిడి నాగార్జున అన్నారు. ఆదివారం స్థానిక ప్రయివేటు కల్యాణ మండపంలో అట్టహాసంగా జరిగిన కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్‌గా ఆయన బాధ్యతలను స్వీకరించారు. డిసిసిబి సిఇఒ ఉమామహేశ్వరరావు ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నాగార్జున ప్రమాణం చేస్తూ, డిసిసిబి అభివృద్ధికి తన సాయిశక్తులా కృషి చేస్తానన్నారు. చైర్మన్‌గా తనకు అప్పగించిన బాధ్యతలను నెరవేరుస్తానని చెప్పారు. డిసిసిబి చైర్మన్‌గా అత్యున్నత ప్రమాణాలను పాటిస్తానని, సేవలను విస్తృతం చేస్తానని చెప్పారు.

డిసిఎంఎస్ సేవలను విస్తృతం చేస్తా : కృష్ణ

విజయనగరం టౌన్ : డిసిఎంఎస్ సేవలను విస్తృతం చేయడం ద్వారా బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని చైర్మన్ గొంప కృష్ణ అన్నారు. స్థానిక డిసిఎంఎస్ కార్యాలయంలో ఆదివారం అట్టహాసంగా జరిగిన కార్యక్రమంలో ఆయన డిసిఎంఎస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆయనతో డిసిఎంఎస్ జిల్లా మేనేజర్ సాయికుమార్ సంతకాలు చేయించి, బాధ్యతలను అప్పగించారు. ఈ సందర్భంగా కృష్ణ మీడియాతో మాట్లాడుతూ చైర్మన్‌గా తనకు ప్రభుత్వం నుంచి లభించే గౌరవ వేతనం, ఇతర అలవెన్స్‌లు తీసుకోబోనని, ఆ డబ్బును డిసిఎంఎస్‌ను బలోపేతం చేసేందుకు వినియోగిస్తానని ప్రకటించారు. డిసిఎంఎస్ ఫలాలను అందరికీ అందించేందుకు సాయశక్తులా కృషి చేస్తానన్నారు. పార్టీ విజయం కోసం తాను పడిన కష్టానికి ప్రతిఫలంగా ఈ పదవిని అందించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి, మంత్రి నారా లోకేష్‌కు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఎపి మోడల్ స్కూల్లో ప్రవేశాలకు మరో అవకాశం

సాలూరు రూరల్ : మండలంలోని పురోహితుని వలసలో గల ఎపి మోడల్ స్కూల్ , కాలేజీలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలతో పాటు 7,8,9 తరగతుల్లో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తు చేసుకునేందుకు విద్యాశాఖ కమిషనర్ పాఠశాల, కళాశాలలో ప్రవేశాలకు మరో అవకాశం కల్పించినట్లు పాఠశాల ప్రిన్సిపల్ అంజలీదేవి తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులు ఈనెల 20లోగా ఆన్లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చునని పేర్కొన్నారు.

'ప్రయివేటు'కే షైనింగ్ స్టార్?

ప్రభుత్వ విద్యార్థులకు మొండిచేయి ● నేడు అవార్డులను ప్రదానం చేయనున్న మంత్రులు

షైనింగ్ స్టార్.. ప్రతిభే కొలమానంగా పేర్కొంటూ పదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు ప్రభుత్వం ప్రకటించిన అవార్డు ఇది. అలాంటి అవార్డులకు ఎంపిక విధానం లోపభూయిష్టంగా తయారైంది. ప్రభుత్వ విద్యార్థులకు పెద్దపీట వేయాల్సిన చోట.. వారికి అన్యాయం చేస్తున్నారు. ప్రయివేటు విద్యాసంస్థలను ప్రోత్సహిస్తూ అందలమెక్కిస్తున్నారు. ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యాలకు ఇలాంటి అవార్డులు ప్రకటించి, వాటి అభివృద్ధికి ప్రత్యక్షంగా సహకరిస్తున్నారని చెప్పేందుకు ఈ అవార్డుల ఎంపికే తార్కాణం. అవార్డుల ఎంపిక ప్రక్రియపై జిల్లా వ్యాప్తంగా విమర్శలు వస్తున్నాయి.

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు షైనింగ్ స్టార్ అవార్డులు ఇచ్చి ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులకు ఈ అవార్డులు ప్రదానం చేస్తారు. అవార్డుకు ఎంపికైన విద్యార్థులకు రూ.20 వేలు నగదు, పతకం, సర్టిఫికెట్ అందిస్తారు. ఈ అవార్డులను సోమవారం మంత్రుల చేతుల మీదుగా అందజేసేందుకు జిల్లా విద్యా శాఖ సిద్ధమైంది. పదో తరగతిలో మండల స్థాయిలో ఆరుగురిని ఎంపిక చేస్తారు. వీరిలో ఒసి, బిసిలు ఇద్దరు చొప్పున, ఎస్‌సి, ఎస్‌టిలను ఒక్కొక్కరు చొప్పున ఎంపిక చేస్తారు. అదనంగా జిల్లా స్థాయిలో 70 శాతానికి పైగా మార్కులు సాధించిన ప్రత్యేక అవసరాలు కలిగిన ముగ్గురు విద్యార్థులను అవార్డుకు ఎంపిక చేస్తారు. నిబంధనలు చెప్పడానికి, వినడానికి చక్కగా ఉన్నాయి.. ఇందుకు భిన్నంగా విద్యార్థుల ఎంపిక ప్రక్రియ సాగిందనే విమర్శలు వెలువెత్తు తున్నాయి. పథకం గొప్పదే అయినా కార్పొరేటు విద్యాసంస్థలకు ఫలితం దక్కేలా ఊడిగం చేసేలా ఉందని పలువురు విమర్శిస్తున్నారు. అవార్డులకు ప్రయివేటు పాఠశాలల విద్యార్థులను ఎంపిక చేసి, ఆ పాఠశాలల ఉన్నతికి మరింత ఉపయోగపడేలా ఉందని పలువురు ఆరోపిస్తున్నారు.

ఇంటర్‌లో 46 మంది ఎంపిక

ఇంటర్‌లో గ్రూపుల వారీగా ఎంపిసి, బైపిసి, సిఇసి, హెచ్‌ఇసి, ఎంఇసి, ఒకేషనల్ గ్రూపుల్లో విద్యార్థులను ఎంపిక చేశారు. వారిలో ప్రభుత్వ కళాశాలల నుంచి 17 మంది, ప్రయివేటు కళాశాలల నుంచి 29 మంది విద్యార్థులు ఉన్నారు.

ప్రభుత్వ బడుల విద్యార్థులకు అన్యాయం

జిల్లాల్లో ప్రభుత్వ విద్యార్థులకు అన్యాయం జరిగిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అందుకు సగానికిపైగా ప్రయివేటు విద్యాసంస్థల విద్యార్థులు ఎంపిక కావడమే నిదర్శనమని పలువురు చెబుతున్నారు. జిల్లాలో అత్యధిక మార్కులు వచ్చిన విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో ఎంతో మంది ఉన్నారు. ప్రభుత్వ విద్యార్థులను ఎంపిక చేయకపోవడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఇదేమి ఎంపిక? అనే విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. ప్రయివేట్ విద్యాసంస్థల్లో చదివిన విద్యార్థులకు 589 మార్కులు వస్తే, ఎంపిక చేసి రివార్డులు, అవార్డులు ఇవ్వడం ఎందుకని, దీన్ని ప్రోత్సహించడం వెనుక ఏ ఉద్దేశం దాగి ఉందో? అనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.

ఎంపికైన విద్యార్థుల వివరాలు	
గవర్నమెంట్	1
జెడ్‌పి హైస్కూళ్లు	52
మోడల్ స్కూళ్లు	17
ఎపి గురుకులాలు	8
గిరిజన గురుకులాలు	2
కెజిబివి	5
బిసి వెల్ఫేర్	8
ప్రయివేటు స్కూళ్లు	65
మొత్తం విద్యార్థులు	**158**

ప్రభుత్వ పాఠశాలలను ఆదరించాలి, ప్రోత్సహించాలి తప్ప ప్రయివేట్ విద్యార్థులకు ఎందుకు రివార్డులు ఇవ్వాలనే సందేహాలు వస్తున్నాయి. అదే మార్కులు వచ్చిన ప్రభుత్వ విద్యార్థులను వెనుకబాటుకు గురిచేయడం, ప్రభుత్వ పాఠశాలలను క్రమక్రమంగా నిర్వీర్యం చేసే కుట్రలు ఉన్నట్లు తెలుస్తోందని పలువురు పేర్కొంటున్నారు. ప్రభుత్వ అవార్డుల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పెద్దపీట వేయాలి తప్ప ప్రయివేట్ విద్యార్థులను ప్రోత్సహించి జిల్లా స్థాయిలో ఇలాంటి కార్యక్రమాలు ఎందుకు చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. ప్రకటించిన షైనింగ్ స్టార్ అవార్డులో వెనుకబడిన విద్యార్థులకు అదే మార్కులు వచ్చినా ఎంపిక కావడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. దీనిపై ఇప్పటికే ఫిర్యాదులు కూడా కొంతమంది చేసినట్లు తెలుస్తోంది. ప్రయివేట్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఒసి కేటగిరిలో 580 మార్కులు దాటితే ఎంపిక చేసి, ప్రభుత్వ పాఠశాలల్లో చదివి 580 మార్కులు పొందిన వెనుకబడిన తరగతుల విద్యార్థులను ఎందుకు ఎంపిక చేయడం లేదని పలువురు బాహాటంగా ప్రశ్నిస్తున్నారు.

కార్పొరేట్లకు ఊడిగమే

ప్రభుత్వ పాఠశాలల్లో పేద, వెనుకబడిన తరగతుల విద్యార్థులు చదువుతున్నారు. వారిని ప్రోత్సహించి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి. అంతే తప్ప ఇలాంటి అవార్డులు ఇచ్చి ప్రయివేట్ పాఠశాలలను ప్రోత్సహించడం అంటే ప్రభుత్వం కార్పొరేట్లకు ఊడిగం చేయడమేనని, ఈ విధానం ఇలాగే కొనసాగితే ప్రభుత్వ పాఠశాలలు క్రమక్రమంగా మూసివేస్తారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం ప్రతి మండలానికి ఒసి 2, బిసి రెండు, ఎస్‌సి, ఎస్‌టిలకు ఒక్కొక్కటి చొప్పున అవార్డులు ఇవ్వాలి. ఇలాంటి ప్రభుత్వ పథకాల వల్ల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులలో మానసిక ఆత్మస్థైర్యం దెబ్బతిని తిరిగి ప్రయివేట్ పాఠశాలలను ఆశ్రయిస్తారని, ప్రభుత్వ కార్యక్రమంలో ఏ పథకమైనా మొదట ప్రభుత్వ విద్యార్థులకు ప్రథమ స్థానం ఇవ్వాలని పలువురు కోరుతున్నారు. ఇకనైనా ప్రభుత్వ విద్యార్థులకు న్యాయం చేసి, మండలాలు వారీగా అత్యధిక మార్కులు పొందిన విద్యార్థులను ప్రోత్సహించే కార్యక్రమాలు చేపట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి: మంత్రి

ప్రజాశక్తి - సాలూరురూరల్

రాష్ట్ర రాజధాని కోసం ఎన్నో ఏళ్లుగా నమ్ముకున్న తమ భూములను ఇచ్చి వారి దాతృత్వాన్ని చాటుకున్న ఆ ప్రాంత మహిళల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన సాక్షి టీవీ యాజమాన్యంపై తక్షణమే చర్యలు తీసుకోవాలని గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆమె పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్రం విడిపోయిన తర్వాత ఈ రాష్ట్రానికి రాజధాని లేకుండా అయిపోయిందని, అటువంటి రాజధాని లేని ఈ రాష్ట్రానికి ఒక రాజధాని కావాలని తలంపుతో అమరావతి పరిసర ప్రాంతాల రైతులను ముఖ్యమంత్రి ఒప్పించి వారి నుంచి సుమారు 33వేల ఎకరాల భూములను రాజధాని నిర్మాణం కోసం సేకరించారని తెలిపారు. ఈ సేకరణ నిమిత్తం 29 గ్రామాల ప్రజలు రాష్ట్ర రాజధాని నిర్మాణానికి తమ భూములను ప్రభుత్వానికి ఇవ్వడానికి ముందుకొచ్చిన ఈ ప్రాంత రైతులు, మహిళలు ఎంతో గొప్ప మనసును చాటుకున్నారని అన్నారు. అటువంటి మహిళల పట్ల మొదటి నుంచి సాక్షి పేపరు, టీవీ యాజమాన్యం నిరంతరం విషం చిమ్ముతుందని ఆరోపించారు. అలాగే ఇప్పుడు కూడా సభ్య సమాజం తలదించుకొనేలా, ప్రజలకు విషాన్ని వెళ్లగెక్కేలా అమరావతి ప్రాంతమంతా వేశ్యలు నివసిస్తున్నారని వాఖ్యానించడం దారుణమన్నారు. ఇలాంటి విష ప్రచారాలను ప్రసారం చేసే సాక్షి టీవీ మేనేజింగ్ డైరెక్టర్ వైఎస్ భారతి, దాని యాజమాన్యం, ఇటువంటి విష ప్రచారాలను ప్రోత్సాహిస్తున్న వైసీపీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, అటువంటి వ్యాఖ్యలను ప్రోత్సహించిన ఎవరినైనా ఉపేక్షించకుండా వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకొని శిక్షించేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖీ సూర్యనారాయణ, మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న మంత్రి సంధ్యారాణి

పార్వతీపురం టౌన్ : అమరావతి రాజధానిపై అసభ్య పదజాలం ప్రదర్శించిన సాక్షి ఛానల్ ప్రతినిధులు కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజుపై చర్యలు తీసుకోవాలని తెలుగు మహిళలు ఆదివారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో జనసేన, తెలుగు మహిళలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లక్ష్మీపురం వద్ద ఏనుగుల గుంపు

సీతానగరం : మండలంలోని లక్ష్మీపురం వద్ద ఏనుగుల గుంపు సంచరిస్తుంది. ఈ ఏనుగుల గుంపులో ఆరు పెద్దవి, రెండు చిన్న ఏనుగులు ఉన్నాయి. ఏనుగుల సంచారంతో పొలాలకు వెళ్లేందుకు రైతులు భయాందోళనకు గురవుతున్నారు. అరటి తోటలు, వెదురు పొదల వద్ద ఇవి నివాసం ఉంటున్నాయి. సమాచారం అందుకొన్న అటవీశాఖ సిబ్బంది ఏనుగులను సవర్ణముఖీ నదికి తరలించడం తో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. ఇదిలా ఉండగా ఏనుగుల గుంపును చూసేందుకు పరిసర గ్రామాల ప్రజలు పెద్దఎత్తున చేరుకున్నారు.

లక్ష్మీపురం వద్ద సంచరిస్తున్న ఏనుగుల గుంపు

రోడ్డు పనులను పరిశీలిస్తున్న క్వాలిటీ కంట్రోల్ అధికారులు

రోడ్డు నాణ్యత పరిశీలన

ప్రజాశక్తి - కురుపాం

కురుపాంలో చేపట్టి సిసి రోడ్డు పనులను ఆదివారం క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజనీర్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్వాలిటీ కంట్రోల్ ప్రకారం సిసి రహదారి నాణ్యత కూడా సక్రమంగా ఉందని, ఎక్కడా నాణ్యతా లోపాల్లేకుండా బాగానే నిర్మాణాలు చేపట్టారని సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆర్అండ్బి ఇఇ రామచంద్రరావు, ఎఇ సుశీల సిబ్బంది పాల్గొన్నారు.

ట్రోఫీని అందుకుంటున్న కె.శివడ జట్టు సభ్యులు

క్రీడల్లో రాణించాలి

ప్రజాశక్తి - కురుపాం

యువత క్రీడలతో పాటు చదువుల్లోనూ రాణించాలని గుజ్జువాయి సర్పంచ్ హెచ్.నాగేశ్వరరావు అన్నారు. మండలంలో గుజ్జువాయిలో గత పది రోజులుగా 70 టీమ్స్తో జరుగుతున్న క్రికెట్ టోర్నీలో ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్లో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొదటి బహుమతి గెలుపొందిన కె.శివడ గ్రామ జట్టుకు రూ.20వేలు నగదు, ట్రోఫీ, అలాగే ద్వితీయ బహుమతి పొందిన ధర్మలక్ష్మీపురం గ్రామ జట్టుకు రూ.10వేలు నగదు, ట్రోఫీని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువతకు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని, కావున క్రీడలు ప్రతిరోజు ఆడాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువత పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, రైతులు

సరిపడా విత్తనాలు పంపిణీ చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - కొమరాడ

రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు సరిపడా వరి విత్తనాలు, ఎరువులు అందజేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజ్ సెంటర్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సాంబమూర్తి మాట్లాడుతూ మండలంలో రైతులకు సరిపడా వరి విత్తనాలు, ఎరువులు అందని పరిస్థితి ఉందన్నారు. దీనివల్ల రైతులు ప్రైవేటు డీలర్ల వద్ద అధిక ధరలకు విత్తనాలు, ఎరువులు విక్రయించాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. పదెకరాలున్న రైతుకు ఐదు వరి ధాన్యం బస్తాలు, ఐదెకరాలున్న వారికి మూడు బస్తాలు ఇవ్వడం దారుణమన్నారు. మిగతా విత్తనాలు ప్రైవేట్ డీలర్ల వద్దకొనుక్కోవడం వల్ల అధిక మోతాదులో డబ్బులు రైతులు ప్రైవేటు డీలర్లకు చెల్లించాల్సి వస్తుందన్నారు. కావున ప్రభుత్వం స్పందించి రైతులకు సరిపడా విత్తనాలు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రెడ్డి శివున్నాయుడు, గిరిజన నాయకులు అప్పారావు, వెంకటేశు, సుబ్బారావు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేసిన
వ్యక్తిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

ప్రజాశక్తి - పాలకొండ

సోషల్ మీడియా వేదికగా స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్టు సిఐ చంద్రమౌళి తెలిపారు. భామిని మండలం సోలికిరికి చెందిన జామి వెంకటేష్ వృత్తి రీత్యా కారు డ్రైవర్. ఇన్స్టాగ్రామ్లో నిందితుడు తన స్నేహితుడు పోస్ట్ చేసిన ఎమ్మెల్యే నిమ్మక వీడియోకు అత్యంత అమానుష రీతిలో కామెంట్ చేశాడు. దీంతో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా జనసేన సంయుక్త కార్యదర్శి వజ్రగడ రవికుమార్ (జనసేన జానీ) ఈనెల 2న స్థానిక పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన సిఐ విచారణ చేపట్టి వెంకటేష్ను అదుపులోకి తీసుకున్నారు.

సమస్యల పరిష్కారం అంతంత మాత్రమే

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక పేరుకే తప్ప పరిష్కారం అంతంత మాత్రమేనని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ఆదివారం కాంగ్రెస్ నాయకులు వి.దాలినాయుడు, జిల్లా నాయకులు కోలా కిరణ్కుమార్, మండల అధ్యక్షులు తీళ్ల గౌరీశంకరరావు విలేకరులతో మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు సుమారు 90 నుండి 100 వరకు అర్జీలు వస్తున్నాయని, అందులో కొన్నింటిని మాత్రమే సంబంధిత అధికారులు ఆన్లైన్ చేస్తున్నారన్నారు. ఆన్లైన్ అయిన దరఖాస్తుదారునికి సమస్యల పరిష్కార నిమిత్తం సెల్ ఫోన్కు మెసేజ్, సమాచారం అందుతుందన్నారు. ఆన్లైన్ చేయని వాటికి ఎటువంటి సమాచారం ఉండడం లేదన్నారు. జిల్లాలోని నలుమూలల నుంచి తమ సమస్య పరిష్కరించబడుతుందనే ఆశతో వచ్చిన అర్జీదారులకు నిరాశే ఎదురవుతుందన్నారు. సమస్య మాత్రం పరిష్కారం కావట్లేదన్నారు. కేవలం కాగితాల పైనే సమస్య పరిష్కరిస్తున్నారే తప్ప క్షేత్రస్థాయిలో పరిష్కరించడం లేదని ఆరోపించారు. తక్షణమే ప్రభుత్వం దీనిపై దృష్టి సారించి ప్రతి సోమవారం వచ్చిన అర్జీలన్నింటినీ ఆన్లైన్ చేయించి, అన్ని అర్జీలు పూర్తిస్థాయిలో పరిష్కారమయ్యేలా చర్యలు చేపట్టాలని కోరారు.

నాగావళికి జలకళ

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని కిమ్మీ గ్రామ సమీపాన ఆదివారం నాగావళి నది నీటి కళకళలాడుతోంది. నిన్నటి వరకూ ఇసుక మేటలతో కనిపించే నది ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా నదిలో నీరు చేరుతుంది.

నాగావళి నదిలో ప్రవహిస్తున్న వరద

మింగ మెతుకులేదు.. మీసాలకు సంపంగి నూనె

- గిరిజన సంక్షేమ విద్యార్థులకు ఎఫ్ఆర్ఎస్
- ఏడాది కావస్తున్నా తొలి సంతకానికి దిక్కు లేదు
- మౌలిక సదుపాయాలు అంతంత మాత్రమే

ప్రజావక్తి - పార్వతీపురం

రాష్ట్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల పరిస్థితి మింగడానికి మెతుకుల్లేవు, మీసాలకు సంపెంగ నూనె అన్న చందంగా తయారైంది. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు ఎఫ్ఆర్ఎస్ అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు అన్ని ఐటిడిఎలకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. విద్యార్థులకు ఫేషియల్ రికగ్నిషన్ సిస్టం అమలు చేయడంలో సాధ్యాసాధ్యాలు పరిశీలించకుండా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం వివాదాస్పదమవుతోంది. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తోంది. ఈ ఏడాదిలో తీసుకున్న కీలకమైన నిర్ణయాలే అమలుకు నోచుకోలేదు. ఆశ్రమ పాఠశాలల్లో గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్య, ఆరోగ్యం అందించాలనే లక్ష్యంతో పని చేయకుండా వారి హాజరుపై ఎఫ్ఆర్ఎస్ అమలు చేయాలని నిర్ణయించడం చర్చనీయాంశమవుతోంది. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ఉద్యోగులకే ఎఫ్ఆర్ఎస్ సరిగ్గా అమలు కావడం లేదు. మారుమూల ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్న గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ఎఫ్ఆర్ఎస్ అమలుకు సాంకేతిక కారణాలు అడ్డంకిగా ఉంటున్నాయి. సెల్ ఫోన్ సిగ్నల్స్ లేక ఉపాధ్యాయులు, ఉద్యోగులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో విద్యార్థులకు ఎఫ్ఆర్ఎస్ అమలు చేయాలని భావించడం అనాలోచిత నిర్ణయమని గిరిజన సంఘాలు భావిస్తున్నాయి. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనపై ఎటెష్టి సారించని ప్రభుత్వం ఆచరణ సాధ్యం కాని అంశాలపై తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని ఆ సంఘాల నాయకులు కోరుతున్నారు.

వంటమనుషులు, సిబ్బంది ఏరీ?

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు భోజనం తయారు చేసే వంట మనుషులు, కమాటీలు లేరు. ఏళ్ల తరబడి ఈ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. స్థానిక పాఠశాల హెచ్ఎం, వార్డెన్లు అనధికారికంగా సిబ్బందిని నియమించుకుని పనులు చేయిస్తున్నారు. 90 శాతం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో, వసతి గృహాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. ఏళ్ల తరబడి గ్యాస్ సిలిండర్ల బిల్లులు మంజూరు కాకపోవడంతో కొన్ని పాఠశాలల్లో కట్టెల పొయ్యి పైనే వంటలు చేయాల్సి పరిస్థితి నెలకొంది. ఈ సమస్య పరిష్కారానికి చొరవ చూపకుండా ఎఫ్ఆర్ఎస్ అమలు పై నిర్ణయం తీసుకోవడం వివాదాస్పదమవుతోంది.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ ఏదీ?

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు తరచూ అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. మలేరియా, డెంగీ జ్వరాలతో ఏటా విద్యార్థుల మరణాలు సంభవిస్తున్నాయి. గిరిశిఖర గ్రామాలకు చెందిన పిల్లలను వారి తల్లిదండ్రులు ఉజ్వల భవిష్యత్తు కోసం ఈ పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణపై శ్రద్ధ వహించే సిబ్బంది ఆశ్రమ పాఠశాలల్లో లేకపోవడంతో అనారోగ్యం బారిన బాధపడుతున్న విద్యార్థులకు సకాలంలో వైద్యమందని పరిస్థితి కనిపిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్ఎంల నియామకం చేపట్టాలని గిరిజన సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎఎన్ఎంల నియామకం ఫైలుపై మంత్రి సంధ్యారాణి తొలి సంతకం చేశారు. ఆమె సంతకం చేసి ఏడాది కావస్తున్నా ఎఎన్ఎంల నియామకం జరగలేదు. ఆశ్రమ పాఠశాలల్లో కుక్, కమాటీలు, ఎఎన్ఎంల నియామకం చేపట్టకుండా ప్రభుత్వం విద్యార్థులకు ఎఫ్ఆర్ఎస్ అమలుపై ఎందుకంత తొందర అని గిరిజన సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు.

మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టాలి

పి.రంజిత్ కుమార్, గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలి. ఏళ్ల తరబడి పాఠశాలల్లో కుక్, కమాటీల నియామకం లేదు.దీని వల్ల విద్యార్థులకు భోజనం తయారు చేయడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆరోగ్య పరిరక్షణకు సంబంధించి ఎఎన్ఎంల నియామకం చేపట్టాలి. ఎఎన్ఎంల నియామకం ఫైలుపై తొలి సంతకం చేసి ఏడాది కావస్తోంది. ఇంతవరకు అతీగతీ లేదు. ఒకవేళ విద్యార్థులకు ఎఫ్ఆర్ఎస్ అమలు చేయాలని నిర్ణయిస్తే తగిన సిబ్బందిని నియమించాలి. లేకపోతే ఇది అమలులో సమస్యలు ఎదురవుతాయి.

వైద్యసేవలపై రోగులను అడిగి తెలుసుకుంటున్న సిపిఎం నాయకులు ఎన్వై నాయుడు

జ్వరాలతో వణుకుతున్న ఏజెన్సీ

ఒకే బెడ్పై నలుగురు జ్వర పీడితులు

మంత్రి, కలెక్టర్ వెంటనే అదనపు బెడ్లు ఏర్పాటు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - సాలూరురూరల్

సాలూరు ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులు జ్వరాలతో వణికిపోతున్నారు. ఏ గ్రామంలో చూసినా ప్రతి పదిమందిలో ఐదుగురు జ్వరాలతో ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని పిహెచ్సిలు, ఏరియా ఆసుపత్రి జ్వర బాధితులతో కిటకిటలాడిపోతున్నాయి. ఈ మేరకు ఆదివారం నాడు స్థానిక100 పడకల ఆసుపత్రిని సిపిఎం బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్వై నాయుడు, నాయకులు విజయ్, దుంబ్రి, రాముడు రోగులను పరామర్శించి, వారికి అందుతున్న వైద్యం గురించి ఆరా తీశారు. అనంతరం నాయుడు మాట్లాడుతూ సాలూరు ఏరియా ఆసుపత్రికి రోజుకు 250 నుంచి 300 మంది రోగులు జ్వరాలతో వస్తున్నారన్నారు. వచ్చిన వారిలో ఎక్కువ మంది మలేరియా, టైఫాయిడ్ జ్వరాలతే ఎక్కువన్నారు. గిరిశిఖర గ్రామాల నుంచి రోజురోజుకు రోగులు తాకిడి పెరుగుతుందో ఆందోళన వ్యక్తం చేశారు. సాలూరు ఏరియా ఆసుపత్రిని వంద పడకల హాస్పిటల్ స్థాయికి పెంచిన తర్వాత రోగులకు అన్ని సేవలు అందించేందుకు ప్రతి రోజూ స్థానిక వైద్యులు అందుబాటులో ఉన్నా, రోగులకు సరిపడా బెడ్లు లేకపోవడం, ఆసుపత్రిలో వున్న బెడ్లు కూడా చిన్నవి కావడంతో, ఒక్కో బెడ్పై ఇద్దరు నుండి నలుగురు వరకు పేషెంట్లు సర్దుకుని కూర్చోవడం కనిపించిందని తెలిపారు. వర్షాకాలానికి ముందుగా అకాల వర్షాలతో ఏజెన్సీ గిరిజన ప్రాంతాల్లో జ్వరాల సీజన్ ప్రారంభమైందన్నారు. ప్రతి గ్రామం నుంచి రోజురోజుకు జ్వరాలతో బాధితులు పెరుగుతున్నా, ఆసుపత్రికి వచ్చే జ్వరపీడితులకు సరైన సేవలందించకుండా ఇక్కడ ఉండే అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు యోగా పేరిట కాలక్షేపం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. రోగాలతో ప్రజలు బాధపడుతున్నా దీని గురించి కనీసం పట్టించుకోకుండా ఇలా ప్రతిరోజు యోగా కార్యక్రమాల పేరుతో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తూ కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. రోగుల వద్దకు వారి పరిస్థితిని, వారికి అందుతున్న సేవలను గురించి పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు పిహెచ్సిలను, ఏరియా ఆసుపత్రిను సందర్శించి అక్కడ ఏ అవసరాలు ఉన్నాయి... ఏఏ మందులు అవసరం, రోగులకు ఎటువంటి సేవలు అందుతున్నాయి అన్న విషయాన్ని గ్రహించి వారికి సరైన వైద్య సేవలందేలా కృషి చేయాలని ఆయన కోరారు. సాలూరు, మక్కువ, పాచిపెంట మండలాల పరిధిలో నిర్మాణంలో ఉన్న పిహెచ్సిలను, వంద పడకల ఆసుపత్రిని ఈ సీజన్లో పనులు పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని డిమాండ్ చేశారు.

అందని డైట్ బిల్లులు

గగ్గోలు పెడుతున్న హెచ్డబ్ల్యుఒలు, డిప్యూటీ వార్డెన్లు

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల

ప్రజాశక్తి -సీతంపేట

ఏజెన్సీలో ఉన్న ఆశ్రమ పాఠశాలకు, వసతి గృహాలకు గత ఎనిమిది నెలలుగా ప్రభుత్వం డైట్ బిల్లులు చెల్లించకపోవడంతో డిప్యూటీ వార్డెన్లు, వసతి గృహ సంక్షేమాధికారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నెలలు తరబడి డైట్ బిల్లుల చెల్లించకపోవడంతో అప్పులు చేయాల్సి వస్తోంది. గ్యాస్కైతే ముందుగానే డబ్బులు చెల్లించాల్సి వస్తుందని నిర్వాహకులు గగ్గోలు పెడుతున్నారు. మరో మూడు రోజుల్లో హాస్టళ్లు పునః ప్రారంభం కానున్నాయి. ఈ పరిస్థితుల్లో మరింత అప్పులు చేయాల్సి వస్తుందని నిర్వాహకులు ఆందోళన చెందుతున్నారు.

సీతంపేట ఐటిడిఎ పరిధిలో 47 ఆశ్రమ ఉన్నత పాఠశాలలు, 18 పోస్టుమెట్రిక్ వసతి గృహాల్లో సుమారు 16వేల మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. 1 నుంచి 3 తరగతి వరకు ఒక విద్యార్థికి రూ.40, 3 నుంచి 5 తరగతి వరకు తలకు రూ.42, 6 నుంచి 10 తరగతి వరకు విద్యార్థికి రూ.46, ఇంటర్ విద్యార్థులకు రూ.52 రోజుకు ప్రభుత్వం చెల్లిస్తుంది. అదే మెస్ చార్జీల నెలకు విద్యార్థి కింద డైట్ కోసం రూ.1600 ప్రభుత్వం ఖర్చు చేస్తుంది. ఉదయం పాలు, పూరీ, ఉడకబెట్టిన కోడిగుడ్డు, ఉదయం విరామ సమయంలో వేరుశెనగ చెక్కి, మధ్యాహ్నం చికెన్ బిర్యాని, సాయంత్రం విరామం తర్వాత స్నాక్స్, రాత్రి భోజనం. వారానికి ఆరు రోజులు గుడ్లు, రెండు రోజులు చికెన్ బిర్యాని ఉంటుంది. అయితే గత ఏడాది అక్టోబర్ నుంచి మే వరకు ఎనిమిది నెలలుగా ప్రభుత్వం మెస్ఛార్జీలు చెల్లించకపోవడంతో వసతి గృహ నిర్వాహకులు వ్యాపారులకు నగదు చెల్లించలేక మొఖం చాటేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే అప్పులు చేసి హాస్టళ్ల నిర్వహణ చేస్తున్నామని వాపోయారు.

గిరిజన సహకార సంస్థ కేవలం కారం, ఉప్పు, పప్పులు, మినప గుళ్ళు, బియ్యం, నూనె సరఫరా చేస్తుందని, మిగతా కూరగాయలు, చికెన్ బయట మార్కెట్లో కొనుగోలు చేయాల్సిందేనని చెబుతున్నారు. ఇక గ్యాస్ అయితే ముందుగానే నగదు చెల్లిస్తే తప్ప గ్యాస్ డోర్ డెలివరీ చేయరని, దీంతో బిల్లులు అందక చేతిలో నగదు లేక ఇబ్బందులుపడుతున్నామని పలువురు వార్డెన్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణలో ఇదే మెనూ ఒక విద్యార్థికి రూ.2200 చెల్లిస్తుంది అది కూడా బిల్లులు వెంటనే చెల్లిస్తుంది. మన రాష్ట్రంలో నెలలు తరబడి బిల్లులు చెల్లించకపోవడంతో నిర్వాహకులకు అవస్థలు తప్పడంలేదు. ఈ విషయమై ఎటిడబ్ల్యుఒ జి.మంగవేణి వద్ద ప్రస్తావించగా, డిసెంబర్ నుంచి ఆర్బిఐలో బిల్లులు పెండింగ్లో ఉన్నాయని, ఈ నెలాఖరులోగా బిల్లులు వచ్చే అవకాశాలున్నాయని తెలిపారు.

గ్రంథాలయ సందర్శన

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక శాఖా గ్రంథాలయాన్ని ఆదివారం కొత్తగా వచ్చిన జిల్లా గ్రంథాలయ కార్యదర్శి వివిజిఎస్ శంకరరావు తనిఖీ చేశారు. గ్రంథాలయ పరిసరాలు పరిశీలించారు. ప్రవేశ ద్వారం సరిగ్గా లేకపోవడంతో పాఠకులు రాలేక పోతున్నారని అన్నారు. ఇంతకు ముందు రోడ్డుకు ఎదురుగా ఉండే గ్రంథాలయం ఇప్పుడు దీనికి ఎదురుగా షాపింగ్ కాంప్లెక్స్ కట్టడంతో ఇబ్బందిగా మారిందని గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్ బాబు చెప్పారు. కార్యదర్శి సెస్ కోసం పంచాయతీ కార్యాలయానికి వెళ్లి అడగమని చెప్పారు. ఈయన వెంట సిబ్బంది రామకృష్ణ తదితరులు ఉన్నారు.

భామిని: స్థానిక శాఖా గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయం కార్యదర్శి వివిజిఎస్ శంకర్రావు పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో విజిటర్ రిజిస్టర్, అందుబాటులో ఉన్న పుస్తకాలు, రికార్డులను పరిశీలించారు. వేసవి శిక్షణా శిబిరాలను ఎలా నిర్వహించారని లైబ్రయన్ అని అడిగి తెలుసుకున్నారు. లైబ్రరీ నిర్వహణ పై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో లైబ్రయిన్ టి.ఇందిర ఉన్నారు.

ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టంగా అమలు చేయాలి

ప్రజాశక్తి - పాచిపెంట

ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టంగా అమలు చేసిఎండియు వాహనాలను కొనసాగించాలని, నాణ్యమైన సరుకులు అందించాలని కోరుతూ పద్మాపురం వద్ద సిఐటియు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గిరిజనులు ఆదివారం నిరసన చేపట్టారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎండియు వాహనాలను రద్దు చేయడం ప్రజా పంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేయడమేనన్నారు. దాదాపు 18,500 కుటుంబాలు ఈ వాహనాల్లో పనిచేసి జీవనం సాగిస్తున్నాయని, ఇప్పుడు వారందరికీ భద్రత లేని పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎండియు వాహనాలను కొనసాగించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే చాలామంది పేదలు పొలం పనులు చేసుకుని ఎండియు వాహనాల ద్వారా బియ్యం తీసుకోకపోతే వారికి డిపోల దగ్గరికి వెళ్లి రేషన్ సరుకులు తీసుకునేలా చర్యలు చేపట్టాలని కోరారు. అవినీతి జరుగుతుందన్న నెపంతో రాష్ట్ర ప్రభుత్వం ఇలా చేయడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతారన్నారు. నాణ్యతా ప్రమాణాలతో కూడుకున్న సరుకులు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే నగదు బదిలీ పథకం అమలు చేయాలన్న ప్రభుత్వ ఆలోచన మానుకోవాలని డిమాండ్ చేశారు. సర్వర్లు సక్రమంగా పనిచేయక ఇప్పటికే ఎక్కువమంది రేషన్ డిపోల వద్ద ఇబ్బందులు పడుతున్న పరిస్థితి ఏర్పడిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఎండియు వాహనాలను నడిపించి రేషన్ సరుకులు అందించేలా చర్యలు చేపట్టాలని, అదే మాదిరిగా రేషన్ డిపోలను కూడా కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు కె.రాజారావు, నీలాద్రి సింహాచలం, బి.చిన్నారావు, శెట్టి త్రినాధ, సిహెచ్ గంగమ్మ, పెదకాపు లక్ష్మి, పి.రవి తదితరులు పాల్గొన్నారు.

పద్మాపురం వద్ద నిరసన తెలుపుతున్న గిరిజనులు

సీతానగరం: ఎండియు వాహనాల ద్వారానే రేషన్ సరుకులు పంపిణీ చేయాలని మహిళలు డిమాండ్ చేశారు. మండలంలోని పెదభోగిలి పంచాయితీ బుడ్డిపేటకు చెందిన మహిళలు ఎండియు వాహనాల ద్వారానే సరుకులు అందించాలని కోరుతూ ఆదివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు కిలోమీటర్లు వెళ్లి రేషన్ తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. గత ప్రభుత్వ ఏర్పాటు చేసిన వాహనాల ద్వారానే పంపిణీ చేస్తే ప్రజలకు మేలు ఉంటుందని వారు కోరారు. కార్యక్రమంలో గవర మాలతి, ఆర్.లక్ష్మి, ఆర్.సత్తెమ్మ, పలువురుమహిళలు పాల్గొన్నారు.

నేడు తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా

ఎండిఎం వాహనాలను కొనసాగించాలని సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నాను నిర్వహిస్తున్నట్టు సిఐటియు మండల కార్యదర్శి గవర వెంకటరమణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎండియు వాహనాల రద్దుతో వృద్ధులు, మహిళలు, వికలాంగులు నానా ఇబ్బందులు గురవుతున్నారన్నారు. కావున ఈ వాహనాలను కొనసాగించాలని కోరుతూ ధర్నా చేపడుతున్నామన్నారు. ఈ ధర్నాలో ఎండియు వాహనదారులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు.



ఉపాధ్యాయుడ్ని సన్మానిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, పూర్వ విద్యార్థులు

అట్టహాసంగా పాఠశాల వజ్రోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పాఠశాల వజ్రోత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా జరిగాయి. 1950 నుండి 2025 వరకు పదో తరగతి పూర్వ విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని అప్పటి గురువులను సన్మానించి, మెమెంటో అందజేసి పాదాభివందనం చేసి ఆశీర్వాదం పొందారు. పాఠశాలకు ఐదెకరాల స్థలాన్ని ఇచ్చిన కత్తుల కవిటికి చెందిన రౌతు చిన్నమనాయుడు విగ్రహాన్ని ఆవిష్కరించారు. అలాగే పాఠశాల ఆవరణలో గల కలియుగ భీముడు కోడి రామ్మూర్తి నాయుడు విగ్రహానికి పూల మాలలు వేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పాఠశాల గొప్పతనాన్ని నలుమూలల చాటి చెప్పడం అభినందనీయమన్నారు. వేడుకలకు ఎక్కడెక్కడ నుంచో వచ్చి పాల్గొని ఇంత గొప్ప విజయాన్ని అందించిన కమిటీ సభ్యులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీతో పాటు జిల్లా ఇన్ఛార్జి డిఇఒ రాజ్ కుమార్ను వజ్రోత్సవ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. అలాగే స్థలదాత చిన్నంనాయుడు కుటుంబ సభ్యులకు ఘనంగా సన్మానించి మెమొంటోళ్లు అందజేశారు.

యువకుడు ఆత్మహత్య

శృంగవరపుకోట : మండలంలోని గౌరీపురం గ్రామానికి చెందిన సేనాపతి సాయికుమార్ (26) గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్ఐ గంగరాజు తెలిపారు. ఇటీవల కాలంలో తరచూ కడుపునొప్పితో బాధపడుతుండేవాడు. ఆ బాధను భరించలేక ఈనెల రెండవ తేదీ రాత్రి సాయికుమార్ గడ్డి మందు తాగాడు. ఇది తెలుసుకున్న అతని తండ్రి సేనాపతి అప్పారావు సాయికుమార్ను వెంటనే స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించాడు. ప్రథమ చికిత్స అనంతరం విశాఖపట్నంలోని కిమ్స్కు తీసుకెళ్లారు. అక్కడి నుంచి కెజిహెచ్కు తరలించారు. అక్కడ చికిత్స అనంతరం ఇంటికి తీసుకొని వచ్చారు. ఆదివారంం తెల్లవారు జామున సుమారు రెండు గంటల ప్రాంతంలో సాయికుమార్కు మళ్లీ విపరీతమైన కడుపునొప్పి రావడంతో ఇంటి దగ్గరే చనిపోయాడని సాయికుమార్ తండ్రి సేనాపతి అప్పారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు

మహిళ ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని వల్లంపూడి పోలీస్స్టేషన్ ఎదుట ఆదివారం ఎస్కోట మండలం కాపు సోంపురం గ్రామానికి చెందిన రొంగలి లక్ష్మి (25) పెట్రోలు పోసుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. పోలీసులు కథనం ప్రకారం.. కాపు సోంపురం గ్రామానికి చెందిన ఎర్రయ్యతో లక్ష్మికి గతంలో వివాహ మైంది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. వీరిద్దరూ ఎస్కోటలోని ఎస్టి బాలుర వసతి గృహంలో చదువుతున్నారు. ఇటీవల లక్ష్మి, తన భర్త ఎర్రయ్యతో గొడవ వేరుగా ఉంటూ విశాఖ పట్నంలో పనికోసం వెళ్లింది. అక్కడ వేపాడ మండలం సోంపురం గ్రామానికి చెందిన గేదెల ఖాళీతో ఆమెకు పరిచయమైంది. ఈ పరిచయం వివాహేతర సంబంధానికి దారి తీసింది. అప్పటికే అవివాహితుడుగా ఉన్న ఖాళీ లక్ష్మిని పెళ్లి చేసుకుంటానని నమ్మ బలికి విశాఖపట్నంలో కొంతకాలం తనతో కాపురం చేశాడు. ప్రస్తుతం తనను దూరం పెట్టడంతో ఆమె వల్లంపూడి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. దీంతో ఇరువురి గ్రామ పెద్దలను పోలీసు స్టేషన్కు పిలుపించగా ఆమె ఎవరో తమకు తెలియదని కాపు సోంపురం పెద్దలు అనడంతో మనస్థాపానికి గురైన లక్ష్మి పక్కనే ఉన్న కొబ్బరికాయలు దుకాణం వద్ద పెట్రోల్ కొనుక్కొని ఒంటిపై పోసుకుని నిప్పంటిం చుకుంది. వెంటనే స్పందించిన స్థానికులు మంటలను అదుపు చేసి 108 ద్వారి ఎస్కోట ప్రభుత్వాస్పత్రికి తరలించామని ఎస్ఐ సుదర్శన్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన వెల్లడించారు.